క్లుప్తంగా

ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

తుక్కుగూడ: రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ తల్లి ఆలయానికి భక్తులు పోటెత్తారు. మంగళ వారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో దర్శనం కోసం బారులుతీరారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు, బోనం నైవేద్యం సమర్పించారు. సామూహిక శ్రీ సత్యానారా యణ స్వామి వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాజకీయాలకతీతంగా గ్రామాల అభివృద్ధి

ఎంపీపీ జ్యోతి, జెడ్పీటీసీ జంగారెడ్డి



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

కందుకూరు: మండల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎంపీపీ జ్యోతి, జెడ్పీటీసీ జంగారెడ్డి అన్నారు. మండల పరిధిలోని గుమ్మడవెల్లిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.33 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం వారు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాల్లో ప్రాధాన్యతా క్రమంలో నిధులు కేటాయించి పనులు చేస్తున్నామన్నారు. రాజకీయాలకు అతీతంగా అందరూ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గౌర ప్రభాకర్, నాయకులు మంద పాండు, బాబురావు, సామయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ కాంటెస్టెడ్ కార్పొరేటర్ అభ్యర్థి పున్న నిర్మల గణేష్ జన్మదిన వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైనా టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి హాజరై నిర్మలకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. నాయకులు రాష్ట్ర ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ బండి మధుసూదన్ రావు, తలాటి రమేష్ నేత, నల్లంకి ధనరాజ్ గౌడ్, జిల్లా జగన్నాథం, గడ్డం లక్ష్మీనారాయణ, కొకుంట్ల రవితేజ, దుర్గాప్రసాద్, రేణుక, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

15,16 తేదీల్లో జాతీయ సదస్సు

వనస్థలిపురం: తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సౌజన్యంతో హయత్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 15, 16 తేదీల్లో 'తెలంగాణ అస్తిత్వ పోరాట సాహిత్యం- సమాలోచన' అనే అంశంపై రెండు రోజులపాటు తెలుగు జాతీయ సదస్సు నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.జోత్స్నప్రభ ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సు సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం సదస్సు నిర్వహణకు సహకరిస్తున్న నక్క శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి వనస్థలిపురం ఏసీపీ పి.కాశి రెడ్డి, వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి, హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణలకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, సాంఘికసంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలు, ఇతర కళాశాలల నుంచి ఎందరో అధ్యాపకులు సదస్సులో పాల్గొని పత్ర సమర్పణ చేస్తారని వారు తెలిపారు. సన్నాహక కార్యక్రమాలలో డా.కె.సురేష్, డా.చింతల రాకేష్ భవానీ, డా.గంజి శశిధర్, డా.బి.రవీందర్, డా.టి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని బండ రావిరాల గ్రామంలో గల శ్రీ ఉమామహేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి జరిగిన కల్యాణోత్సవంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కిషన్‌గౌడ్, ఎంపీటీసీ అనిత, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కొత్త అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు అభినందనీయం

ఆమనగల్లు: ఆర్యవైశ్యుల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వీరబొమ్మ రామ్మోహన్ హర్షం వ్యక్తం చేశారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. ఈ సందర్భంగా సీఎంకి కృతజ్ఞతలు తెలిపారు.

ఫుడ్ 'సేఫ్టీ'యేనా?

- మార్కెట్‌లో విచ్చలవిడిగా కల్తీ ఆహార పదార్థాలు
- రోగాలబారిన పడుతున్న ప్రజలు
- కొరవడిన అధికారుల తనిఖీలు



జెల్లీలో కనిపిస్తున్న పురుగు

కందుకూరు: ఫుడ్ సేఫ్టీ అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఆహార పదార్థాల్లో నాణ్యతా లోపంతో పాటు కల్తీతో వినియోగదారులు రోగాలబారిన పడుతున్నారు. రోడ్ల వెంబడి, స్థానికంగా ఉన్న షాపుల్లో కంటే నాణ్యతగా ఉంటాయని పెద్దపెద్ద సూపర్ మార్కెట్లలో సరుకులు కొన్నా నాణ్యతా లోపం తప్పడంలేదు. హోటళ్లు, బేకరీలు, రోడ్డు పక్కన నడిపే చిన్నచిన్న టిఫిన్ సెంటర్లు, పానీ పూరీలు, గప్‌చుప్ బండ్లు ఇలా ఎక్కడ చూసినా పరిశుభ్రత లోపించడంతో అవి తిన్న ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. అయినా సంబంధిత అధికారులు మాత్రం తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

పర్యవేక్షణ కరువు..

మండల పరిధిలో విక్రయించే ఆహార పదార్థాలపై పర్యవేక్షణ కరువైంది. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల తనిఖీలు అసలే లేవు. దీంతో ఇష్టానుసారంగా విక్రయాలు కొనసాగుతున్నాయి. మరోపక్క నాణ్యత లేని సరుకుల విక్రయాలు పెరిగిపోయాయి. హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, బేకరీల్లో విక్రయించే తినుబండారాలు తయారయ్యే కిచెన్‌ల వద్ద ఎక్కడ చూసినా పారిశుద్ధ్యం అరకొరగానే కనిపిస్తోంది. అవేవి తెలియని ప్రజలు వాటిని తిని రోగాలబారిన పడుతున్నారు.

నిత్యం ఏదో ఒకచోట..

గతేడాది మండల పరిధిలోని నేదునూరులో ఓ బాలుడు మూడు చక్రాల వాహనంపై విక్రయిస్తున్న ఐస్‌క్రీంను కొనుగోలు చేసి తినే క్రమంలో అందులో మృతి చెందిన బొద్దింక బయటపడింది. ఇటీవల కొత్తగూడ చౌరస్తాకు చెందిన ఓ వ్యక్తి శంషాబాద్ సమీపంలోని ఓ పేరు మోసిన సూపర్ మార్కెట్‌లో పిల్లల కోసం కొనుగోలు చేసి తెచ్చిన ఫుడ్ జెల్లీ ప్యాక్‌లో మృతి



ఐస్‌క్రీమ్‌లో కనిపిస్తున్న పురుగు(ఫైల్)

చెందిన జెర్రీతో పాటు పురుగు కనిపించడంతో హడలిపోయారు. పిల్లలు వాటిని తింటే ఎలాంటి ప్రమాదం సంభవించేదోనని ఆందోళన వ్యక్తం చేశారు. బేకరీలకు సరఫరా అయ్యే కేక్‌లు, బిస్కెట్లు వంటి వాటిని కిచెన్ నుంచి రోడ్డుపై దుమ్ములోనే ఏలాంటి కవర్లు ఏర్పాటు చేయకుండానే పనివాళ్లతో నేరుగా సరఫరా చేయిస్తుండటం నిత్యకృత్యంగా మారింది ఇక్కడ. వాటిపై కనిపించని దుమ్ము పేరుకుపోయినా వాటినే అద్దాల్లో పెట్టి విక్రయిస్తుంటారు. సంబంధిత అధికారులు మాత్రం మాముళ్లు తీసుకొని ఏమీ పట్టించుకోవడంలేదని ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జెల్లీలో పురుగు వచ్చింది



ఇటీవల శంషాబాద్ సమీపంలోని ఓ ప్రైవేట్ సూపర్ మార్కెట్‌లో సెల్జ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన స్క్వార్జ్ ఫ్రూటీ జెల్లీ పుడ్డింగ్‌ను పిల్లల కోసం కొన్నాం. ఇంటికి వచ్చిన తర్వాత ఆ బాక్స్ తెరిచి చూడగా అందులో రెండు విడివిడి ప్యాక్‌లలో ఒకదాంట్లో జెర్రీ, మరో దాంట్లో పురుగు మృతి చెంది కనిపించాయి. అధికారులు సదరు కంపెనీపై చర్యలు తీసుకోవాలి.

– చెన్నారెడ్డి, కొత్తగూడ

తనిఖీలు నిర్వహించాలి



హోటళ్లు, బేకరీలు, తోపుడు బండ్లపై ఆహార పదార్థాలు నాణ్యత లేకుండా విక్రయిస్తున్నా పట్టించుకునే వారే లేరు. తయారు చేసే చోట పరిస్థితి దారుణంగా ఉంటుంది. ఫుడ్ అధికారులు అసలే రారు. ఇంతవరకు ఎక్కడా తనిఖీ చేసినట్లుగా మేము చూడలేదు, కనీసం వినలేదు. తరచూ ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు వచ్చి తనిఖీలు చేస్తే భయంతోనైనా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తారు.

– సుధాకర్‌రెడ్డి, కందుకూరు

బిల్లు తీసుకోవాలి



వినియోగారులు చైతన్యం అయినప్పుడే విక్రేతలు అక్రమాలు, కల్తీలు చేయకుండా ఉంటారు. మా ఫోరం తరఫున వినియోగదారులకు అండగా నిలబడతాం. ఏ వస్తువు అయినా కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలి. వినియోగదారులు కోర్టులో కేసు ఫైల్ చేయడానికి ఎలాంటి ఫీజు తీసుకోం. వినియోగదారులకు న్యాయం జరిగేలా పనిచేస్తాం.

– అంజయ్య, వినియోగదారుల ఫోరం ఇన్‌చార్జి

వైకుంఠధామం విషయంలో..

- కావాలనే రాజకీయం చేస్తున్నారు
- కొత్తగూడ మాజీ సర్పంచ్ మల్లారెడ్డి

కందుకూరు: మండలంలోని కొత్తగూడలో నిర్మించిన వైకుంఠధామం విషయంలో కొందరు రాజకీయ దురుద్దేశంతోనే ఆరోపణలు చేస్తున్నారని ఆ గ్రామ మాజీ సర్పంచ్ సాధ మల్లారెడ్డి తెలిపారు. వైకుంఠధామానికి స్వర్గస్తులైన కుటుంబ సభ్యుల పేరుతో శిలాఫలకం ఏర్పాటు చేశారని కొందరు ఫిర్యాదు చేయడంతో ఈ విషయమై మంగళవారం ఆయన కందుకూరులో మాట్లాడారు. ప్రభుత్వ భూమిలో నిర్మించిన వైకుంఠధామానికి మొత్తం రూ.25.50 లక్షలు ఖర్చు అయిందన్నారు. అందులో ఎన్ఆర్ఈజీఎస్ నుంచి రూ.12.60 లక్షలు మాత్రమే నిధులు మంజూరయ్యాయన్నారు. జీపీ నిధుల నుంచి మరో రూ.3.82 లక్షలు వెచ్చించామన్నారు. రాళ్లు తీయడం, భూమిని చదును చేయడంతో పాటు షెడ్లను, స్నానాల గదులు అన్ని విశాలంగా నిర్మించామన్నారు. గ్రామానికి చెందిన రమేష్ అనే వ్యక్తి షెడ్ నిర్మాణానికి రేకులు, పైపులు అందించాడన్నారు. మిగతా రూ.12.88 లక్షలు తన సొంత డబ్బు ఖర్చు చేశానన్నారు. అందు కోసమే గుర్తుగా తన తాత, నాయనమ్మ పేరుతో శిలాఫలకం ఏర్పాటు చేశానన్నారు. ఐదేళ్ల పాటు గ్రామాభివృద్ధికి ఎంత కష్టపడి పనిచేసింది గ్రామ ప్రజలకు తెలుసన్నారు. అనవసరంగా కొంతమంది రాజకీయాల కోసం తనపై అసత్య ప్రచారాలకు దిగారన్నారు. వారికి చిత్తశుద్ధి ఉంటే నేను ఖర్చు చేసిన డబ్బును తిరిగి ఇప్పిస్తే గ్రామంలో నిర్మిస్తున్న దేవాలయానికే ఖర్చు చేస్తానని స్పష్టం చేశారు. ఆయన వెంట బాలేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ధరణిపై మాట్లాడే అర్హత మీకు లేదు

- బీఆర్ఎస్ నేతలపై టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు జంగారెడ్డి ఫైర్

కందుకూరు: ధరణి వెబ్‌సైట్ తెచ్చి రైతుల్ని నట్టేట ముంచిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి, నాయకులకు మాట్లాడే అర్హతే లేదని టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన మంగళవారం కందుకూరులో మాట్లాడారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి సమస్యలు ఎందుకు పరిష్కరించలేకపోయిందని ప్రశ్నించారు. 30 లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టడంతో రైతుబంధు రాక, రుణాలు అందక, కనీసం అవసరానికి భూమి విక్రయించలేక రైతులు నానా అగచాట్లు పడ్డారన్నారు. ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తుంటే.. దొంగే దొంగ అన్న చందంగా బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారం పోయి పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల కోఆర్డినేటర్ అఫ్జల్‌బేగ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, సీనియర్ నాయకులు సత్యనారాయణ, సుధాకర్‌రెడ్డి, గణేష్, వెంకటేష్‌గౌడ్, జగదీశ్వర్, సురేందర్‌రెడ్డి, గణేష్‌నాయక్, వెంకటేశ్, శ్రీశైలం, నర్సింహ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జంగారెడ్డి తదితరులు

ముగిసిన బ్రహ్మోత్సవాలు



పల్లకీసేవలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఉదయం ఆలయంలో శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల చివరి రోజు కావడంతో తెల్లవారుజామున దోపోత్సవం నిర్వహించి విగ్రహాలను పల్లకీ సేవలో ఊరేగించారు. బ్రహ్మోత్సవాలు విజయవంతంగా ముగిశాయని.. సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, ఆలయ ఈఓ మురళీకష్ణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు సహకరించిన దాతలు, పనిచేసిన వలంటీర్లకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలతో పాటు, పలు శాఖల అధికారులను ఆలయ చైర్మన్ ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సుదర్శన్ యాదవ్, ఆలయ మాజీ చైర్మన్లు యాదయ్య, సుధీర్ గౌడ్, ఈశ్వర్, నవీన్, మాజీ డైరెక్టర్ చంద్రయ్య, జంగయ్య, ఆలయ డైరెక్టర్లు రాకేష్, అల్లె రాకేష్, కన్నయ్య, జగన్, సాయిలు, శ్రీశైలం, పీఏసీఎస్ డైరెక్టర్లు ప్రభాకర్, బాలయ్య, న్యాయవాది అశోక్, బీజేవైఎం మండల అధ్యక్షుడు శ్రవణ్, ఏకలవ్య, ఆలయ ప్రధాన పూజారి వీరేశం, ఆలయ మాజీ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం: కమిషనర్

ఇబ్రహీంపట్నం రూరల్: అక్రమ నిర్మాణాలు చేపడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ స్పష్టం చేశారు. మంగళవారం ఆదిబట్ల మున్సిపాలిటీ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా మున్సిపల్ లేదా హెచ్ఎండీఏ అనుమతులు తీసుకోవాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. ఇప్పటికే మున్సిపాలిటీలోని అక్రమ నిర్మాణాలు చేపడుతన్నవారికి నోటీసులు జారీ చేశామని, పనులు కూడా నిలిపివేశామని తెలిపారు. అలాగే మున్సిపాలిటీలో రూ.3.43 కోట్ల పన్నులు వసూళ్ల డిమాండ్ ఉందన్నారు. ఇప్పటివరకు రూ.2.46 కోట్లు వసూలు చేశామన్నారు. మరో రూ.9.6 కోట్లు చేయాల్సి ఉందన్నారు. ఇంటి పన్నులు, నల్లా బిల్లులు వసూలు చేయడానికి అందరూ సహకరించాలని కోరారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 11, వంకాయ 28, బెండ 45, పచ్చిమిర్చి 60, కాకర 38, బీర 35, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 25, క్యారెట్ 23. దొండ 28, ఆలు 27, ఉల్లి 24, గోకర 45, దోస 19, సొర 09, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 60, అర్వి 47, మునగ 45, చిలగడదుంప 65, బీట్‌రూట్.

విద్యార్థులే ఉపాధ్యాయులుగా..



తలకొండపల్లి: ఉపాధ్యాయులతో మెదక్‌పల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

తలకొండపల్లి: మండల పరిధిలోని మెదక్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి చక్కగా పాఠాలు బోధించారు. హెచ్‌ఎంగా శృతి, డీఈఓగా అక్షయ, ఎంఈఓగా నందిని, కాంప్లెక్స్ హెడ్మాస్టర్‌గా సుష్మతో పాటు, 12 మంది విద్యార్థులు వివిధ నిర్వహణ బాధ్యతలు నిర్వహించారు. అనంతరం హెచ్ఎం శ్రీనివాస్ మాట్లాడారు. విద్యార్థులందరూ క్రమ శిక్షణతో మెలుగతూ చక్కగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ సర్దార్‌నాయక్, హెచ్ఎం శ్రీనివాసులు, కోఆప్షన్ సభ్యులు విష్ణుగౌడ్, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ పర్వతాలు, శంకర్, రమేష్‌రెడ్డి, విక్రమ్ కుమార్‌రెడ్డి, శోభారాణి, తదితర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆమనగల్లు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో..

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు. ప్రధానోపాధ్యాయురాలిగా అంజలి, ఉపాధ్యాయులుగా ప్రవళిక, విరీష, రాకేశ్, అశ్విని, వైష్ణవి, ఇవాంజిల్ వ్యవహరించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాండు, ఉపాధ్యాయురాలు స్వప్న పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ మురళీధర్‌రెడ్డి దంపతులు



హాజరైన భక్తులు

తరలివచ్చిన భక్తజనం

మహేశ్వరం: మండల పరిధిలోని మన్సాన్‌పల్లిలో శ్రీరేణుకా ఎల్లమ్మ దేవతా కల్యాణం, బోనాల జాతర మంగళవారం వైభవంగా జరిగాయి. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 11:30 నిమిషాలకు తదియ రేవతి నక్షత్రయుక్తమున వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య అమ్మవారి కల్యాణం నిర్వహించారు. భజనలు, భక్తి గీతాలు అలపించి భక్తులను అలరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్, ట్రస్టీ మురళీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మల్లేష్ యాదవ్, అరుణ, మాజీ ఉప సర్పంచ్ నర్సింహ యాదవ్, కాంగ్రెస్ నాయకులు రాఘవేందర్‌రెడ్డి, స్థానిక నాయకులు జాన్‌రెడ్డి, ఆంజనేయులు గౌడ్, రాఘవేందర్ గౌడ్, రాజు యాదవ్, కృష్ణ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మీర్‌పేటలో ఆధార్ నమోదు కేంద్రం

మీర్‌పేట: మీర్‌పేట పోలీస్‌స్టేషన్ ఆవరణలోని ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ వికల్ప్ సెంటర్‌లో మీర్‌పేట పోలీసుల సహకారంతో మంగళవారం ట్రాన్స్‌జెండర్ల కోసం ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ట్రాన్స్‌జెండర్స్ కోసం ప్రత్యేకంగా ముషీరాబాద్ ఆధార్ రీజినల్ సెంటర్ వారిచే ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ఈ క్యాంపులో 110 మంది ట్రాన్స్‌జెండర్లు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్, సర్టిఫికెట్ కోసం.. అదే విధంగా ఉపాధి, స్వయం ఉపాధి కోసం మరో 17 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. ఈ ప్రాంతంలోని మిగతా ట్రాన్స్‌జెండర్లు కూడా ఈ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ సుధాకర్, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ అహ్మద్ అలీ, సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీకాంత్, చంద్రయ్య, వికల్ప్ సెంటర్ కోఆర్డినేటర్ సంజీవులు, అసిస్టెంట్ కోఆర్డినేటర్ సాయికుమార్ పాల్గొన్నారు.



ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న సీఐ కాశీవిశ్వనాథ్

నామ్‌కే వాస్తే..

- ధరణి స్పెషల్ డ్రైవ్‌లో కక్షిదారులకు నిరాశ
- సమస్యలు పరిష్కరించేందుకు లాగిన్ కాని వెబ్‌సైట్
- సమాధానం చెప్పలేక తలలు పట్టుకుంటున్న రెవెన్యూ సిబ్బంది



తహసీల్దార్ కార్యాలయంలో ధరణి ఫైళ్లను పరిశీలిస్తున్న అధికారులు

ఇబ్రహీంపట్నం: రెవెన్యూ శాఖలో భూములకు సంబంధించి ఏర్పాటు చేసిన ధరణి వెబ్‌సైట్‌తో ఏర్పడిన సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్ నామమాత్రంగా కొనసాగుతోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం బీఆర్ఎస్ హయాంలో భూ సమస్యలు సులువుగా పరిష్కరించేందుకు ధరణి పోర్టల్‌ను ఏర్పాటు చేశారు. ఒకరి భూములు మరొకరిపై, సర్వే నంబర్లు తప్పుల తడకగా, కొందరికి తక్కువగా మరికొందరికి ఎక్కువగా పట్టాదారు పాసు పుస్తకాల్లో భూముల నమోదు తదితర సమస్యలు కోకొల్లలుగా ధరణి పోర్టల్‌తో తలెత్తాయి. ఈ సమస్యలను పరిష్కరించాలంటే తహసీల్దార్ చేతుల్లో ఎలాంటి ఆప్షన్ లేకుండా జిల్లా కలెక్టర్‌కు అధికారాన్ని కట్టబెట్టారు. దీంతో కలెక్టరేట్ కార్యాలయాల చుట్టూ రైతులు చెప్పులరిగేలా తిరిగారు. తమ అవసరాలకు భూమలును విక్రయించుకునేందుకు సైతం వీలుకాని పరిస్థితులు ఏర్పడ్డాయి.

నూతన ప్రభుత్వంలోనైనా..

అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి సమస్యల పరిష్కారానికి ఒక కమిటీని వేసింది. అందుకు అనుగుణంగా ఈనెల 1 నుంచి 17వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్‌కు శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో ఇబ్రహీంపట్నం మండలంలో సుమారు 3వేలకుపైగా పెండింగ్ భూసమస్యలున్నట్లు ఇప్పటివరకు గుర్తించారు. అందులో 650 సమస్యలు పరిష్కరించేందుకు ఫైళ్లను అధికారులు సిద్ధం చేశారు. అయితే ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి అదేశాలు రాకపోవడంతో వెబ్‌సైట్ లాగిన్ కావడంలేదు. ఎప్పటి మాదిరిగానే సమస్యలు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇందులో ముఖ్యంగా టీఎం-33 సమస్యల పరిష్కారానికి అధికంగా దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది. పేరు మార్పిడి, మిస్సింగ్ సర్వే నంబర్లు, భూ విస్తీర్ణం తప్పుగా నమోదు కావడం, ఒకరి భూమి మరొకరి సర్వేనంబర్‌లోకి వెళ్లడం తదితర సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు ప్రత్యేకంగా వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదికలను పంపేందుకు సిద్ధం చేశారు.

లాగిన్‌కు అనుమతి రాలేదు..

ధరణి సమస్యలు పరిష్కరించేందుకు తమకు లాగిన్ ఇవ్వలేదని రెవెన్యూ అధికారులు అంటున్నారు. దీంతో స్పెషల్ డ్రైవ్‌తో తమ భూ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న రైతన్నలకు నిరాశే మిగులుతోంది. ప్రతిరోజు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. తమ చేతుల్లో ఏమీలేదని లాగిన్‌కు ప్రభుత్వం అనుమతి ఇస్తేనే సమస్యలు పరిష్కరించగలమని రెవెన్యూ సిబ్బంది సమాధానం ఇస్తున్నారని రైతులు అంటున్నారు. అయినప్పటికీ తమ సమస్యలు పరిష్కరించాల్సిందే అని కొందరు రైతులు పట్టుబడుతుండటంతో సమాధానం చెప్పలేక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.